
సాక్షి ఒడిశా

బుధవారం । 6 । నవంబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం

నగదు	రూ. 5,59,886
బంగారం	200 మిల్లీ గ్రాములు
వెండి	27 గ్రాములు

-భువనేశ్వర్/పూరీ



భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

రాష్ట్రంలో నాగుల చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పుట్టల్లో పాలు పోసి నాగన్నకు మొక్కులు చెల్లించుకున్నారు.

- 8లో▸



సమస్యల ఏకరువు

పగుసాని సమితిలో గురండి కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం పాలకమండలి సమావేశం నిర్వహించారు. సభ్యులు సమస్యలు ఏకరువు పెట్టారు.

- 8లో▸

న్యూస్‌రీల్

అవినీతికి పాల్పడితే శిక్ష తప్పదు



గాంధీ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయమూర్తులు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా న్యాయస్థానంలో మంగళవారం అవినీతి నిరోధక వారోత్సవం నిర్వహించారు. ముందుగా న్యాయస్థానం ఎదుట గాంధీ విగ్రహం వద్ద జిల్లా అదనపు జడ్జి శాంతను కుమార్ దాస్ ఆధ్వర్యంలో కోర్టు ఉద్యోగులంతా కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే తప్పకుండా శిక్షిస్తామని శాంతనుదాస్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా చీఫ్ జుడీషియల్ అధికారి సత్య ప్రియ దాస్, లీగల్ సర్వీసెస్ కార్యదర్శి సంగీతా పాన్, పీపుల్స్ కోర్టు న్యాయమూర్తి బబితా సాహు, మహిళా కోర్టు న్యాయమూర్తి విజయ్‌కుమార్ దాస్, ఇతర శాఖల న్యాయమూర్తులు హాజరయ్యారు.

విమానంలో బాంబు కలకలం



బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బాంబు హల్‌చల్ చేయడంతో అంతా బెంబేలెత్తారు. న్యూ ఢిల్లీకి బయల్దేరాల్సిన సమయంలో విమానంలో బాంబు ఉన్నట్లు పుకారు గుప్పుమంది. హడావుడిగా విమానంలోని ప్రయాణికులందరినీ దింపేసి తనిఖీలు చేపట్టారు. చూడబోతే అంతా ఉత్తిదేనని తేలింది. ఇటీవల సుమారు 10 రోజుల కిందట ఇలాంటి పుకారు చెలరేగిన విషయం తెలిసిందే. ఈ పుకారుతో స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంతో, వీర్ సురేంద్ర సాయి విమానాశ్రయాల్లో డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌తో గాలింపు చర్యలు చేపట్టిన తర్వాత అంతా గాలి వార్తగా తేలిపోయింది.

మాజీ ఎమ్మెల్యే పూర్ణచంద్ర మాఝి మృతి



పూర్ణచంద్ర మాఝి (ఫైల్)

రాయగడ: కొరాపుట్, రాయగడ ఉమ్మడి జిల్లా పరిధిలోని లక్ష్మీపూర్ మాజీ ఎమ్మెల్యే పూర్ణ చంద్ర మాఝి (పప్పు) (46) మృతి చెందారు. గత కొద్ది రోజులుగా ఆయన కిడ్నీ సంబంధిత వ్యాధితో రాజధాని భువనేశ్వర్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఆయన 2008లో లక్ష్మీపూర్ శాసనసభ నియోజవర్గంలో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి విజయం సాధించారు. ఆయన మృతిపై పలువురు సంతాపం తెలిపారు.

చెరువులో జారిపడి మహిళ దుర్మరణం



మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి భైరవ సింగపూర్(బి.సింగపూర్) రణస్పూర్ గ్రామంలో అనసూయ అమనాత్య(57)అనే మహిళ చెరువులో పడి మృతి చెందింది. ఉదయం 7 గంటల సమయంలో స్నానానికి వెళ్లగా ప్రమాదవశాత్తు జారిపడి మునిగిపోయింది. గమనించిన గ్రామస్తులు వెంటనే పోలీసులకు, బొరిగుమ్మ అగ్నిమాపక విభాగానికి తెలియజేయగా.. సిబ్బంది గాలించి మృతదేహాన్ని బయటకుతీశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు పోలీసు అధికారి తెలిపారు.

తేనెటీగల దాడిలో 17 మందికి గాయాలు

జయపురం: జయపురం సబ్ డివిజన్ కుంద్రా సమితి గుండాలి గ్రామంలో సోమవారం గ్రామసభ నిర్వహిస్తుండగా తేనెటీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో అదనపు బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి పాపాయి బెహరా, పంచాయతీ వ్యవసాయాధికారి గీతాంజలి త్రిపాఠీ, సంక్షేమ అధికారి సుంజన్ రంజన్ జాలీ, పాత్రికేయుడు సంతోష్ ప్రహరాజ్‌లతో సహా 17 మందికి గాయాలయ్యాయి. బాధితులను జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

రథయాత్ర రగడ..!

- మధ్యంతర రథయాత్రకు ఇస్కాన్ అమెరికా శాఖ సన్నాహాలు
- పూరీ గజపతి మహారాజు అభ్యంతరం
- ఆలోచన విరమించుకోవాలని మంత్రి పృథ్వీరాజ్ సూచన





ఇస్కాన్ సవరించిన తాజా శ్రీజగన్నాథ రథయాత్ర ఆహ్వాన పత్రిక

భువనేశ్వర్: శ్రీజగన్నాథుని రథయాత్ర ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి గాంచినది. తరతరాలుగా పౌరాణిక గ్రంథాలు, శ్రీమందిరం పంచాంగ గణాంకాల ప్రకారం విశ్వవ్యాప్తంగా యాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే దీనికి భిన్నంగా ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్సస్‌నెస్ ఇస్కాన్ వర్గం శ్రీ జగన్నాథ రథయాత్ర ఈనెల 9వ తేదీన నిర్వహించేందుకు నడుం బిగించడం కలకలం రేపుతోంది. ఆరోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రథ యాత్ర నిర్వహించనున్నట్లు ఇస్కాన్ హోస్టన్(అమెరికా) శాఖ ఆహ్వానం జారీ చేసింది. దీంతో ఈ పిలుపుపై సర్వత్రా విచారం వ్యక్తమవుతోంది.

విరమించుకోవాలని అభ్యర్థన

శ్రీజగన్నాథుని తొలి సేవకుడిగా పూరీ గజపతి మహారాజా సుపరిచితం. ప్రస్తుత మహారాజా దివ్యసింగ్ దేవ్ ఇస్కాన్ అకాల రథయాత్ర నిర్వహణ యోచన విరమించుకోవాలనే అభ్యర్థనతో ఇస్కాన్ హోస్టన్ శాఖ అధ్యక్షుడికి లేఖ రాశారు. అక్టోబర్ 29న గజపతి రాసిన లేఖపై పాక్షిక స్పందన లభించింది. లోగడ ప్రకటించిన స్నానయాత్ర కార్యక్రమాన్ని మాత్రమే తొలగించి రథయాత్ర కార్యక్రమాన్ని యథాతథంగా కొనసాగిస్తున్నట్లు పరోక్షంగా తెలియజేశారు. ఈనెల 3న స్నానయాత్ర కార్యక్రమంగా ప్రకటించి విరమించుకున్నారు. అయితే విశ్వ విఖ్యాత శ్రీజగన్నాథ సంస్కృతిని దారి తప్పించడం ఎంతమాత్రం సబబు కాదు. ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా మాత్రమే స్వామి ఉత్సవాలు, యాత్రలు నిర్వహణ కొనసాగాలని గజపతి మహారాజా దివ్య సింగ్ దేవ్ లిఖిత పూర్వకంగా అభ్యర్థించారు.

పునరాలోచన చేయాలని వినతి

రథయాత్ర విరమణపై రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఆశాభావం వ్యక్తం చేశారు. పూరీ గజపతి మహారాజా తరహాలో మంత్రి కూడ ఇస్కాన్ అకాల రథ యాత్ర యోచన విరమించుకోవాలని అభ్యర్థించారు. ఈ అభ్యర్థనపై సానుకూల స్పందనతో శ్రీ జగన్నాథ సంస్కృతి, ఆచార సంప్రదాయాలకు హోస్టన్ ఇస్కాన్ వర్గం పట్టం గడుతుందని మంత్రి భావిస్తున్నారు. హోస్టన్ శాఖ రథ యాత్ర కార్యక్రమంపై ఇస్కాన్ ఇతర శాఖలు సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రధానంగా రాష్ట్రంలో ఇస్కాన్ వర్గాలకు ఈ పరిస్థితి మింగుడు పడడం లేదు. రథయాత్ర నిర్వహణపై పునరాలోచించుకోవాలని అభ్యర్థించినట్లు ఇస్కాన్ ఒడిశా శాఖ అధ్యక్షుడు శాశ్వత పతి దాస్ తెలిపారు.



స్వామి నిశ్చలానంద సరస్వతి, శంకరాచార్యులు

సంప్రదాయాల ఉల్లంఘనే

హోస్టన్ ఇస్కాన్ వర్గం నవంబర్ నెలలో రథయాత్ర అకాల చర్య. ఇది పూర్తిగా శ్రీ జగన్నాథ సంస్కృతి, సంప్రదాయాల ఉల్లంఘనగా పూరీ గోవర్ధన పీఠాధిపతి శంకరాచార్యులు, జగద్గురు స్వామి నిశ్చలానంద సరస్వతీ పేర్కొన్నారు. స్వామివారి భక్త జనుల హృదయాలను కలిచివేసి భావోద్వేగాలను ప్రేరేపిస్తుందన్నారు. ప్రాచీన సాంస్కృతిక ఆచార వ్యవహారాలకు నీళ్లొదిలి రథయాత్ర నిర్వహించడం నిష్ప్రయోజనమే అవుతుందన్నారు.

సహించేది లేదు

- పూరీ గజపతి మహారాజా ఆగ్రహం



పూరీ గజపతి మహారాజా దివ్య సింగ్ దేవ్

అమెరికాలో ఇస్కాన్ వర్గం శ్రీజగన్నాథ స్వామి రథయాత్ర ని ర్వహణపై స్వామి ఆద్య సేవకుడు పూరీ గజపతి మహా రాజా దివ్య సింగ్ దేవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశా రు. హోస్టన్ (అమెరికా) శాఖ ఇటీవల ప్రకటించిన శ్రీజగన్నాథుని అకాల రథయాత్ర కార్యక్రమంపై ఆయన ఘాటుగా స్పందించారు. వైష్ణవ సంప్రదాయం ప్రసారం ముసుగులో పవిత్ర ప్రాచీన శ్రీజగన్నాథ సంస్కృతిని అపహాస్యం చేయడాన్ని ఎంతమాత్రం సహించేది లేదని మంగళవారం స్పష్టం చేశారు. అశేష భక్తజన హృదయాలను కలిచి వేస్తున్న అకాల రథయా త్ర కార్యక్రమాన్ని హోస్టన్ (అమెరికా) విరమించుకోవాలని తెలిపారు. లేకుంటే చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు వెనుకాడమని హెచ్చరించారు. మరోవైపు నైజీరియా శాఖ కూడ ఇదే పంథాలో ఉరకలేస్తోంది. నవంబర్ 23న శ్రీజగన్నాథుని రథ యాత్ర నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. దీంతో ఈ రెండు ప్రాంతీయులకు శ్రీజగన్నాథ సంస్కృతి విలువలను వివరిస్తూ అకాల రథయాత్ర విరమించుకోవాలి లేఖ జారీ చేశారు. వచ్చే ఏడాది మార్చిలో ఇస్కాన్ పాలక మండలి సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో శ్రీ జగన్నాథుని అకాల రథయాత్ర నివారణకు సంబంధించి బలమైన తీర్మానం చేయకుంటే చట్టపరమైన చర్యల కోసం విజృంభింజించడం తథ్యమన్నారు.

ఇస్కాన్ రథయాత్ర రద్దు

భువనేశ్వర్: ఎట్టకేలకు ఇస్కాన్ సంస్థ సంకల్పించిన అకాల రథయాత్ర రద్దు చేసినట్లు ప్రకటించారు. అమెరికా హ్యూస్టన్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9న రథ యాత్ర నిర్వహణ ఖరారు చేసి ఆహ్వానం జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ చర్య పట్ల రాష్ట్రంలో తీవ్ర అసంతృప్తి తలెత్తింది.ఈ కార్యక్రమం ఉపసంహరించకుంటే న్యాయ పోరాటానికి దిగుతామని గజపతి మహారాజా బాహాటంగా హెచ్చరించారు. దీనిపై స్పందించిన ఇస్కాన్ శాఖ ఈ నెల 9న సంకల్పించిన జగన్నాథ రథ యాత్ర రద్దు చేసినట్లు ప్రకటించింది. ఇస్కాన్ భువనేశ్వర్ శాఖ ఉపాధ్యక్షుడు తుకారం దాస్ మంగళవారం సాయంత్రం ఈ విషయం వెల్లడించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న కలెక్టర్, అధికారులు

పర్లాకిమిడి: పెట్రోల్, వంటగ్యాస్ సిలిండర్ల ఫిల్లింగ్, రవాణా చేసేటప్పుడు రసాయన ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బిజయకుమార్ దాస్ అన్నారు. మంగళవారం స్థానిక కాన్ఫరెన్సు హాలులో హిందూస్తాన్, భారత్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ల ప్రతినిధులు, ఎస్పీ జితేంద్రకుమార్ పండా, డిప్యూటీ కలెక్టర్, అత్యవసర అధికారి కమలకాంత పండా, ఏడీఎం రాజేంద్ర మింజ్, జిల్లా ప్రాంతీయ రవాణా శాఖ అధికారి ప్రసన్నకుమార్‌దాస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెట్రోలియం, గ్యాస్ కంపెనీలు గొడౌన్‌ల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సమావేశంలో హెచ్‌పీ గ్యాస్ కంపెనీ ప్రతినిధి శోభన్‌కుమార్ సాహు, గజపతి జిల్లా హెచ్‌పీ గ్యాస్ డీలర్ దేవేంద్రనాథ్ సాహు తదితరులు పాల్గొన్నారు.

దానా తుఫాన్ వ్యయం రూ.23.73 కోట్లు



సురేష్ కుమార్ పూజారి

భువనేశ్వర్: దానా తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 23 కోట్ల 73 లక్షల 76 వేలు వెచ్చించిందని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్‌కుమార్ పూజారి మంగళవారం వెల్లడించారు. రూ.616 కోట్ల 19 లక్షల 30 వేల నష్టాన్ని మిగిల్చిందని, 14 జిల్లాలు అతలాకుతలం అయ్యాయని తెలిపారు. 166 మండలాల్లో 131 మండలాలు ప్రభావితం అయ్యాయని, 11 వేల 637 గ్రామాల్లో 41.04 లక్షల మంది ప్రజలు సర్వం కోల్పోయారని వివరించారు. ఒకటి, రెండు రోజుల్లో బాధితులకు తుఫాన్ సాయం నిధులు అందుతాయని మంత్రి ప్రకటించారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో మండల అధికారులు వీటిని పంపిణీ చేస్తారని తెలిపారు.

రోడ్డుపై ప్రమాదంలో నలుగురికి గాయాలు

- తమిళనాడులో ప్రమాదం
- బాధితులు మల్కన్‌గిరి జిల్లా విలేకరులు



అంబులెన్స్‌లో క్షతగాత్రులు



ప్రమాద స్థలంలో నుజ్జును జ్జయిన బొలేరో వాహనం



ఆగి ఉన్న లారీ



తీవ్రంగా గాయపడిన అలీత్ బైరాగి



స్పృహ కోల్పోయిన ప్రశాంత్, స్వల్ప గాయంతో సౌరభ్

మల్కన్‌గిరి: తమిళనాడు రాష్ట్రం రామేశ్వరం వెళ్లే దారిలో రామన్నపురం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితికి చెందిన నలుగురు విలేకరులు గాయపడ్డారు. కలిమెల సమితికి చెందిన అయత్ బైరాగి, సౌరాభ్ మాండల్, ప్రశాంత్ కుమార్ సాహు, రాజేష్ ఓజాలు శనివారం బొలేరో వాహనంలో తిరుపతి వెళ్లారు. అక్కడి నుంచి సోమవారం రామేశ్వరం బయల్దేరారు. తెల్లవారు జామున ప్రయాణిస్తుండగా రోడ్డుపై ఆగి ఉన్న లారీని బొలేరో ఢీకొట్టింది. దీంతో ఈ నలుగురూ గాయపడ్డారు. స్థానికులు వీరిని సమీపంలోని ఆరోగ్యకేంద్రానికి తరలించారు. పోలీసులు క్షతగాత్రుల వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. అనంతరం వీరిని మధురైలోని ఓ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ముఖేష్ మహలింగ్‌తో చర్చించారు. విలేకరులకు ప్రాణాపాయం తప్పినట్లు తెలిపారు.

భారీగా గంజాయి సీజ్



గుడ్రిపంక వద్ద పట్టుబడిన జగన్నాథ పరిచ్చాతో పోలీసులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా అడవ పోలీసుస్టేషన్ పరిధి నల్లాఘాట్, గుడ్రిపంక, పరమగుడ, ఉలియాపడలో సోమవారం పెట్రోలింగ్ నిర్వహించిన సమయంలో ఒక వ్యక్తి వద్ద సుమారు 337.700 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ మేరకు గుడ్రిపంక గ్రామానికి చెందిన జగన్నాథ పరిచ్చాను అరెస్టు చేసి కోర్టుకు మంగళవారం తరలించినట్లు ఎస్పీ జితేంద్రనాథ్ తెలియజేశారు. అదేవిధంగా అడవ పోలీసుస్టేషన్ పరిధి ఉలియాపడ వద్ద జరిపిన పెట్రోలింగ్‌లో సుమారు మరో 155.900 కిలోలు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ కేసులో ఉపేంద్ర బరయితో, సుధాం దొళాయి, సంతును దొళాయిలు అరెస్టైయ్యారు. వీరందరూ గంజాం జిల్లా బడగోడో గ్రామానికి చెందినవారని వెల్లడించారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం



మాట్లాడుతున్న ఎంపీ అనితా శుభదర్శిని



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు

పర్లాకిమిడి: స్థానిక విశ్వనాథ్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ కార్యవర్గ సభ్యులు, ఆర్గనైజింగ్ సభ్యులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా బీజేపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా అస్కా ఎంపీ అనితా శుభదర్శిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో బీజేపీ సభ్యత్వ నమోదు ప్రభారి టి.గోపి, జిల్లా బీజేపీ రిటర్నింగ్ అధికారి కాశీరాం మాఝి, జిల్లా కార్యవర్గ సభ్యులు శివరాం శువారో, సాధారణ కార్యదర్శి జగన్నాథ మహాపాత్రో, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

భర్తను చెట్టుకు కట్టేసి.. భార్యను హత్య చేసి..

- హరియాముండ గ్రామంలో దోపిడీ దొంగల బీభత్సం



మహేంద్రను చెట్టుకు కట్టేసిన దృశ్యం



సావి మృతదేహం వద్ద గ్రామస్తులు

కొరాపుట్: దోపిడీ దొంగలు అమానుషంగా ప్రవర్తించారు. భర్తను చెట్టుకు కట్టి భార్యని హత్య చేసి నగలు దోచుకుపోయారు. కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి కుమర్ గందన పంచాయతీ హరియా ముండ గ్రామంలో ఈ అమానుష ఘటన చోటుచేసుకుంది. మహేంద్ర ఖొర, సావి ఖొర(24)లు భార్యాభర్తలు. సుభద్ర పథకం కోసం ఆధార్ కార్డు అప్‌డేట్ చేసేందుకు వీరిద్దరూ నందపూర్ వెళ్లారు. తిరిగి వస్తున్న సమయంలో ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో వీరిపై దాడికి పాల్పడ్డారు. కింద పడిపోయిన వెంటనే మహేంద్రను నీలగిరి చెట్టుకు కట్టేశారు. సావిని హత్య చేసి ఆమె ధరించిన బంగారు నగలు దోచుకుని పారిపోయారు. దొంగల దెబ్బలకు సొమ్మసిల్లిపోయిన మహేంద్ర కొంతసేపటి తర్వాత తేరుకొని గట్టిగా అరుస్తూ విలపించారు. ఆ మార్గం గుండా వెళ్తున్న కొందరు వాహనచోదకులు ఈ రోదనలు విని మహేంద్ర కట్లు విప్పి విషయం తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో వెతకగా కొద్ది దూరంలో సావి మృతదేహం గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దొంగలకోసం గాలింపు చేపట్టారు. కొరాపుట్ జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లు చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు మహేంద్రను వైద్యం కోసం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించారు.

ఆకలి చావులపై ఆర్డీసీ దర్యాప్తు

- ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి
- గవర్నర్‌ను కలిసిన కాంగ్రెస్ ప్రతినిధి బృందం



మోహన్ చరణ్ మాఝి, ముఖ్యమంత్రి



రాష్ట్ర గవర్నరుని కలిసిన కాంగ్రెసు ప్రతినిధి బృందం

భువనేశ్వర్: కంధమల్ జిల్లా దారింగిబాడి మండలం మండిపొంకొ గ్రామంలో ఆకలి చావుల సంఘటన కలకలం రేపుతూనే ఉంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నుంచి ఆహార భద్రత కింద బియ్యం రేషన్ నిలిపి వేశారు. దీంతో ఆకలికి తాళలేక పొట్ట నింపుకునేందుకు ఈ గ్రామంలో ప్రజలు ఎండలో ఆరబెట్టిన మామిడి బద్దలతో జావ చేసుకుని తాగారు. ఇది కాస్తా ప్రతికూలం కావడంతో ఇద్దరు మహిళలు ఏకంగా చనిపోయారు. మరో ఆరుగురు అనారోగ్యం బారిన పడి ఆస్పత్రిలో మృతి చెందారు. ఇద్దరి పరిస్థితి ఇంత వరకు విషమంగా కొనసాగుతోంది. వీరి కటక్ ఎస్సీబీ వైద్య బోధన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఆర్డీసీ దర్యాప్తు

ఈ సంఘటనపై మంగళవారం న్యూ ఢిల్లీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆర్డీసీ హోదా అధికారితో దర్యాప్తు జరిపించాలని ఆదేశించారు. దక్షిణ ప్రాంతపు రెవెన్యూ డివిజినల్ కమిషనరు రూపా రోషన్ సాహు ఆధ్వర్యంలో దర్యాప్తు జరుగుతుందని పేర్కొన్నారు.

గవర్నర్ చొరవ కోసం అభ్యర్థన

ఆకలి చావులపై ప్రత్యక్షంగా చొరవ తీసుకోవాలని కాంగ్రెస్ ప్రతినిధి బృందం గవర్నర్‌ను అభ్యర్థించింది. విపక్ష నాయకుడు రామచంద్ర కడమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతినిధి బృందం స్థానిక రాజ్ భవన్‌లో గవర్నరు రఘుబర దాస్‌ని మంగళవారం కలిసింది. ఈ బృందంలో శ్రీకాంత జెనా, మహ్మద్ మొకీం, సంతోష్ సింగ్ సలూజా, జయదేవ్ జెనా వంటి పలువురు రాష్ట్ర కాంగ్రెస్ ప్రముఖులు ఉన్నారు. జాతీయ ఆహార భద్రత కింద ఆకలి చావులకు తావు లేకుండా కొనసాగాల్సిన పరిస్థితుల్లో కంధమల్ జిల్లాలో ఇలాంటి విచారకర సంఘటన తలెత్తడం సిగ్గు చేటుగా కాంగ్రెసు ప్రతినిధి బృందం గవర్నరు సమక్షంలో ఆవేదన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితిపై ప్రత్యక్షంగా చొరవ తీసుకుని సత్వర చర్యలకు ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించింది. వీరి అభ్యర్థనపై రాష్ట్ర గవర్నరు సానుకూలంగా స్పందించారు. ఈ విషయమై ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శితో సమావేశమై తగిన చర్యలకు ఆదేశించడం జరుగుతుందని అభయం ఇచ్చినట్లు ప్రతినిధి బృందం సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా

13 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం పరిధిలో డిగ్రీ 5వ సెమిస్టర్ రెగ్యులర్ సంప్లిమెంటరీ, ఆరో సెమిస్టర్ సప్లి మెంటరీ పరీక్షలు ఈ నెల 13 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్లు యూసీ ఇన్‌చార్జి ఎగ్జామినే షన్స్ డీన్ జి.పద్మారావు తెలిపారు. వర్సిటీ ఎగ్జామినేషన్స్ కార్యాలయంలో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు 62 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హాల్ టికెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. డిగ్రీ మూడో సెమిస్టర్‌కు సంబంధించి రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 11లోపు పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వ్యక్తి ఆత్మహత్య





జీడిచెట్టుకు వేలాడుతున్న మృతదేహం

ఆనందరావు(ఫైల్)

కంచిలి: మండలంలోని జాడుపూడి గ్రామానికి చెందిన కదంబాల ఆనందరావు(53) జీడి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆనందరావు మనస్తాపంతో సోమవారం రాత్రి ఉరి వేసుకున్నాడు. మృతుడి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్ఐ జి.రాజేష్ మంగళవారం ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిత్రలేఖనం పోటీల్లో సన్నిహిత్‌కు రజతం



శ్రీకాకుళం కల్చరల్: అంతర్జాతీయ చిత్ర లేఖనం పోటీల్లో బొమ్మిడాల సన్నిహిత్‌కు రజత పతకం లభించిందని ఎంసీఏ అధినేత మణి పాత్రుని నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన కాసుల చిత్రకళా అకాడమీ అధినేత్రి కె.పద్మావతి ఆధ్వర్యంలో రామాయణ్ సీజన్-2 పేరిట ఇటీవల అంతర్జాతీయ స్థాయి చిత్రకళా పోటీలు జరిగాయి. సన్నిహిత్ ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్నాడు. సన్నిహిత్‌తో పాటు కృష్ణప్రియ పండా, ఎం.లిపి, శ్రీవల్లి, ఎం.జయదేవ్‌కుమార్, జి.భవిష్‌లు కూడా ప్రశంసాపత్రాలు సాధించారు. వీరికి అవార్డులు రావడం పట్ల ఎంసీఏ ప్రతినిధులు పి.రామకృష్ణ, దమ్ము రామారావు, ఎస్‌టీవీఆర్ మూర్తిలు అభినందించారు.

మహిళల భద్రతకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్



పొందూరు పోలీసు స్టేషన్ వద్ద మొక్కలు నాటుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

పొందూరు: జిల్లాలో నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం పొందూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ నిరోధానికి, మహిళల భద్రతకు ప్రత్యేక టాస్క్‌ఫోర్సును నియమించినట్లు తెలిపారు. నేర నియంత్రణపై అవగాహనకు మహిళా పోలీసులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. మహిళా పోలీసు ప్రస్తుతమున్న ఉద్యోగాలతోనే సరిపెట్టుకోకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. అనంతరం పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ హామీలన్నీ అమలుచేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న లిబరేషన్ నాయకులు

పలాస: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బొడ్డపాడు జిల్లా అమర వీరుల స్మారక మందిరంలో మంగళవారం పోస్టర్లు ఆవిష్కరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు మాట్లాడుతూ డిసెంబరు 4న విజయవాడలో జరగనున్న ప్రజాహక్కుల సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభకు లిబరేషన్ పార్టీ జాతీయ కార్యదర్శి దిపాంకార్ భట్టాచార్య ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మద్దిల రామారావు, దున్న శ్రీనివాసరావు, కుత్తుం దుష్యంత్, పోతనపల్లి కామేశ్వరరావు, యుగంధర్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి జిల్లా కలెక్టరేట్ గేటు వద్ద..



జయపురం: నాగుల చవితిని జరుపుకుంటున్న భక్తులు



పర్లాకిమిడి: రాంనగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



జయపురం: పుట్ట వద్ద నైవేద్యం పెడుతూ పూజిస్తున్న మహిళలు

పర్లాకిమిడి: నాగుల చవితి పండుగను ప్రజలు భక్తి శ్రద్ధలతో మంగళవారం జరుపుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి పుట్టలో పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు. పర్లాకిమిడి జిల్లాలోని కాశీనగర్, రాంనగర్, కలెక్టరేట్ గేటు, పోడుగుకోవెల, సీతాసాగరం, రామసాగరం జాజిపురం గ్రామాల్లో నాగపంచమి సందర్భంగా నాగదేవుని పుట్టలో పాలు, గుడ్లు వేసి పూజించారు. అనంతరం శైవమందిరాలలో అభిషేకాలు చేయించి ఉపవాసదీక్షలు చేపట్టారు. పర్లాకిమిడిలో నాగుల చవితి సందర్భంగా మహిళలు కొత్త వస్త్రాలు ధరించి సందడి చేశారు.

రాయగడలో..

రాయగడ: రాయగడ పట్టణంలో ప్రజలు భక్తి శ్రద్ధలతో నాగుల చవితిని జరుపుకున్నారు. స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈసారి పుట్టలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. అలాగే గతంలో ఖాళీగా ఉన్న చోట్ల భవన నిర్మాణాలు చేపట్టడంతో ఈసారి పుట్టలు కరవయ్యాయి. దీంతో పట్టణ శివారు ప్రాంతాలకు వెళ్లి పుట్టలో పాలపోసి మొక్కులు చెల్లించుకున్నారు.

జయపురం: జయపురంలోని తెలుగు ప్రజలు నాగుల చవితిని ఘనంగా జరుపుకున్నారు. పట్టణ శివారులోని పొలాలు, పర్వత ప్రాంతాల్లోని పుట్టల వద్దకు వెళ్లి పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు. బాణసంచా కాల్చి సందడి చేశారు.

భువనేశ్వర్: నాగుల చవితి సందర్భంగా ఖుర్దారోడ్ ప్రాంతంలో పుట్టల ప్రాంగణాలు జనసందోహంతో కళకళలాడాయి. పాలు పోసి పూజించేందుకు పుట్టల కోసం వెదుకులాడాల్సి వచ్చింది. పుట్టలో పాలుపోసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలోని తెగులు ప్రజలు నాగుల చవితిని ఉత్సాహంగా జరుపుకున్నారు. గ్రామ శివార్లలోని పొలాల వద్దకు వెళ్లి పుట్టల్లో పాలుపోసి సంప్రదాయబద్ధంగా మొక్కులు చెల్లించుకున్నారు.



పర్లాకిమిడి: రాంనగర్‌లో పుట్టను పూజిస్తున్న మహిళలు





రాయగడ: పుట్టలో పాలు వేసి పూజిస్తున్న భక్తులు



పర్లాకిమిడి: పీడబ్ల్యూడీ కార్యాలయం వద్ద మొక్కులు చెల్లించుకుంటూ..



జయపురం: పుట్టకు పూజ చేస్తున్న దంపతులు



మల్కన్‌గిరి: పుట్టకు పూజ చేస్తున్న భక్తులు



మల్కన్‌గిరి: మొక్కులు చెల్లించుకుంటున్న రైతు కుటుంబం



మల్కన్‌గిరి: పుట్టకు పూజ చేస్తున్న తెలుగు కుటుంబం



భువనేశ్వర్: మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



కొరాపుట్ జిల్లా నారాయణ పట్న సమితి కేంద్రంలో నాగుల చవితిని జరుపుకుంటున్న ఓ కుటుంబం

పట్టుబడిన అత్యాచార నిందితుడు



పట్టుబడిన నిందితుడు డొంబు గౌడ

జయపురం: ఒక బాలికను అపహరించి, అత్యాచారం చేసిన నిందితుడు రెండేళ్ల తర్వాత పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడు బొరిగుమ్మ సమితి కెందుగుడకు చెందిన డొంబు గౌఢగా జయపురం మహిళ పోలీసుస్టేషన్ అధికారి అనిత కుజూర్ మంగళవారం వెల్లడించారు. వారు తెలిపిన వివరాల మేరకు.. 2022 జూలై మొదటి వారంలో బొరిగుమ్మ సమితికి చెందిన బాలికను డొంబు అపహరించి తీసుకెళ్లాడు. అనంతరం ఆ బాలికను వివిధ ప్రాంతాలకు తిప్పుతూ లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యులు అన్నిచోట్ల గాలించినా జాడ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం అక్టోబర్ 21వ తేదీన మైనర్ బాలికను డొంబు గౌఢ ఇంట్లో గుర్తించి రక్షించారు. అయితే పోలీసుల రాక తెలిసి డొంబు పరారయ్యాడు. మైనర్ బాలికకు వైద్య పరీక్షలు జరిపించి ఆమె స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్లు మహిళా పోలీసు అధికారి అనిత కుజూర్ వెల్లడించారు. బాలికను సీడబ్ల్యూసీ ముందు హాజరుపరచి ఒక సంస్థలో రక్షణ కల్పించారు. అది తెలుసుకున్న నిందితుడు అవకాశం చూసి ఆ బాలికను మరోసారి అపహరించాడు. ఈ ఘటనపై కొరాపుట్ పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అనంతరం సమాచారం అందిన పోలీసులు దాడి జరిపి మరలా ఇప్పుడు అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

దళిత మహిళా మంత్రిని అవమానిస్తారా?

- డిప్యూటీ సీఎం పవన్ వాఖ్యలపై ఎమ్మెల్సీ దువ్వాడ ఖండన



ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: దళిత మహిళా మంత్రిపై అజమాయిషీ చెలాయించేలా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు అవమానకరమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ దుయ్యబట్టారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమిలో కొట్లాట ప్రారంభమయ్యాయని విమర్శించారు. పిఠాపురం సభలో హోంమంత్రి అనితపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో సుమారు 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని ఆనాడు పవన్ తీవ్రంగా విమర్శలు చేశారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మహిళలను ఎందుకు తీసుకురాలేకపోతున్నారని దువ్వాడ ప్రశ్నించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఆడపిల్లలపై అఘాయిత్యాలు పెచ్చుమీరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ హామీలు అమలుపై పవన్ ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. ఒక వైపు రైతు వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని, విత్తనాలు, ఎరువులు అందని పరిస్థితి నెలకొందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో దోపిడీ వ్యవస్థకు తెరతీశారని విమర్శించారు. నెలల వ్యవధి పాలనలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల నుంచి తిరుగుబాటు వచ్చిందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు.

సోషల్‌మీడియాలో ప్రశ్నిస్తే కేసులా?

- వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్



పిట్ట దామోదర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టడం, పోలీసుస్టేషన్‌కు పిలిపించి రాష్ట్ర వ్యాప్తంగా వేధించడం దారుణమని వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ట దామోదర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశ్నించడం రాజ్యాంగం కల్పించిన పౌరుల ప్రాథమిక హక్కు అని, దాన్ని భంగం కలిగించడం సరికాదన్నారు. ప్రశ్నించే గొంతు నొక్కాలని ప్రయత్నం చేస్తున్న ప్రభుత్వ కక్ష పూరిత చర్యలు సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌కు వ్యతిరేకమని పేర్కొన్నారు. రాష్ట్ర పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లకుండా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ న్యాయపరంగా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో లీగల్ సెల్‌ను సంప్రదించి తమ దృష్టికి తీసుకొస్తే అండగా ఉంటామన్నారు.

అత్తకు తలకొరివి పెట్టిన కోడలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న తులసమ్మ

సోంపేట: కన్నకొడుకులే తల్లిదండ్రులను సరిగ్గా పట్టించుకోని కాలంలో కోడలే అన్నీ తానై అత్తకు సపర్యలు చేసింది. మృతి చెందిన తర్వాత తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. కవిటి మండలం బెజ్జిపుట్టుగ గ్రామానికి చెందిన యజ్జల గోపమ్మకు కుమారుడు ప్రసాద్, కుమార్తె ఉన్నారు. కుమారుడు, కుమార్తె వలస కార్మికులుగా బెంగళూరులో ఉపాధి పొందుతున్నారు. గోపమ్మ తన కోడలు తులసమ్మతో కలిసి జింకిభద్రలో నివాసముంటోంది. గోపమ్మ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో మంగళవారం మృతి చెంది. కుమారుడు అందుబాటులో లేకపోవడంతో కోడలు తులసమ్మ దహన సంస్కారాలు నిర్వహించింది. గ్రామస్తులు తమవంతు సహాయ సహకారాలు అందజేశారు.

సమావేశంలో సమస్యల ఏకరువు



గురండి సామాజిక ఆరోగ్యకేంద్రంలో రోగి కల్యాణ సమితి సమావేశానికి స్వాగతిస్తున్న సిబ్బంది

పర్లాకిమిడి: గుసాని సమితిలో గురండి కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం (సి.హెచ్.సీ.) లో రోగి కల్యాణ సమితి పాలకమండలి సమావేశం మంగళవారం ఉదయం జరిగినది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, గుసాని సమితి అధ్యక్షులు ఎస్.వీర్రాజు, గురండి బీడీఓ గుసాని జెడ్పీటీసీ ఎస్.బాలరాజు, గురండి జన స్వాస్థ్య సంప్రసారణ అధికారి మమతా పాఢి తదితరులు హాజరయ్యారు. పాత కార్యవర్గాన్ని రద్దు చేసి కొత్తవారిని నియమించారు. అనంతరం గురండి సీహెచ్‌సీలో సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేయగా ఆయన వెంటనే భువనేశ్వర్‌లో ఆరోగ్యమిషన్ కార్యదర్శికి ఫోన్ చేసి తెలియజేశారు.

పాలకేంద్రంలో నాగుపాము



స్లేడుపై నాగుపాము

సరుబుజ్జిలి: మండలంలోని అమృత లింగానగరం సమీపంలోని పాలకేంద్రంలో మంగళవారం నాగుపాము కలకలం సృష్టించింది. కేంద్రం లోపలి స్లేడుపై పాము బుసలుకొట్టడంతో సిబ్బంది ఉలిక్కిపడ్డారు. వెంటనే గ్రామస్తులు వచ్చి కర్రలతో పామును తరిమికొట్టారు.

పేకాట శిబిరంపై దాడి

రణస్థలం: మండలంలోని పాతర్లపల్లి పంచాయతీ సూరంపేట గ్రామ శివారులో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని జె.ఆర్.పురం పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ. 97,830 నగదు, 9 సెల్‌ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. జెజే.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు బాలల దినోత్సవం పోటీలు

శ్రీకాకుళం కల్చరల్ : బాలల దినోత్సవం పురస్కరించుకొని 3 నుంచి 9వ తరగతి విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కేంద్రంలోని బాల కథానిలయం వ్యవస్థాపకుడు భోగెల ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పి.దేవానంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నిమిషాల జాతీయ గీతాలాపన వీడియో, పది లైన్లలో బాలల కవితలు, నెహ్రూ, జాతీయ నాయకుల చిత్రాలు గీసి బాల కథా నిలయానికి పంపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత పాఠశాల ఉపాధ్యాయుల సంతకం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ నెల 11లోపు ఎంట్రీలు పంపించాలని, ఆ తర్వాత వచ్చిన వాటిని పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. మూడు విభాగాల్లో ఒక విద్యార్థి ఒక పోటీకి మాత్రమే అర్హులని, 89191 71926 వాట్సాప్ నంబర్‌కు ఎంట్రీలు పంపించవచ్చని పేర్కొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి..కుమారుడి పరిస్థితి విషమం
- కుక్కను తప్పించబోయిన బోల్తాపడిన బైక్



మృతదేహాన్ని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్ : దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా తల్లీకొడుకులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. తల్లి మృతిచెందగా.. కుమారుడి పరిస్థితి విషమంగా ఉంది. శ్రీకాకుళం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోలాకి మండలం రాజారాంపురం గ్రామానికి చెందిన తల్లీకొడుకులు మైలపల్లి గురుదేవి(48), అజిత్‌లు మంగళవారం నాగులచవితి సందర్భంగా ఇంటి నుంచి బయలుదేరి సింగుపురంలోని హాటకేశ్వరస్వామి ఆలయానికి బైక్‌పై బయలుదేరారు. స్వామి దర్శనం అనంతరం ఇంటికి తిరిగి వస్తుండుగా సింగుపురం జాతీయ రహదారిపై కుక్క అడ్డంగా రావడంతో ఇద్దరూ స్కిడ్ అయ్యారు. గురుదేవి అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్రగాయాలపాలైన అజిత్‌ను అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. పరిస్థితి విషమంగా మారడంతో కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ట్రిపుల్‌ఐటీ) ఎస్ఎంపురం క్యాంపస్ విద్యార్థిని గౌసియా మంగళవారం సాయంత్రం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ) మొదటి ఏడాది చదువుతున్న గౌసియా తరగతులు ముగిసాక హాస్టల్‌కు వెళ్లింది. అనంతరం గదిలో అపస్మారక స్థితికి చేరుకోవడంతో తోటి విద్యార్థులు గమనించి వసతి గృహ సంక్షేమాధికారులు, సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే క్యాంపస్ అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారిముని రామకృష్ణ విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. ఔట్ పోస్టు పోలీసుల సమాచారం మేరకు ఎచ్చెర్ల ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, విద్యార్థిని జింక్ ఫాస్పేట్ పౌడర్‌ను నీటిలో కలిపి తాగినట్లు సమాచారం. ల్యాబ్‌లో వాడే జింక్ ఫాస్పేట్ పౌడర్ ఈమె వద్ద ఎలా ఉందన్నది తెలియడం లేదు. ఆత్మహత్యాయత్నానికి వ్యక్తిగత సమస్యలే కారణమని అధికారులు చెబుతున్నారు. ఘటన జరిగిన వెంటనే అధికారులు తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో వారు నంద్యాల నుంచి శ్రీకాకుళం బయలుదేరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఘటన స్థలంలో బాధితులు

టెక్కలి రూరల్: స్థానిక మెళియాపుట్టి రోడ్డులో మంగళవారం ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. కోటబొమ్మాళి మండలం ఊడికలపాడు గ్రామానికి చెందిన తోట రామారావు, ఉర్జాన సాంబమూర్తి బైక్‌పై టెక్కలి వస్తూ మెళియాపుట్టి ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి కిందకు దిగుతుండగా.. టెక్కలి నుంచి బైక్‌పై వస్తున్న యువకులు పరస్పరం ఢీకొన్నారు. ఈ ఘటనలో ఊడికలపాడుకు చెందిన వారికి తీవ్రగాయాలు కాగా మిగిలిన ఇద్దరూ స్వల్పంగా గాయపడ్డారు. బాధితులను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి


పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మ వారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటిప్రశాంత్‌లు విశిష్ట కుంకుమార్చన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఫైలేరియా వ్యాధి నిర్ధారణ సర్వే


పెదపెంకిలో రక్త నమూనాలు తీస్తున్న అధికారులు

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో ఫైలేరియా వ్యాధి నిర్ధారణ నిమిత్తం సోమవారం రాత్రి 340మందికి నైట్ బ్లడ్ సర్వే నిర్వహించారు. ఉమ్మడి జిల్లా మలేరియా నివారణ అధికారిణి మణి ఆధ్వర్యంలో రక్త నమూనాలు తీశారు. మైక్రో ఫైలేరియా క్రిమి రాత్రి(విశ్రాంత) సమయంలో చర్మం పైపొరలోకి వస్తుందని ఆ సమయంలో వ్యాధి నిర్ధారణ నిమిత్తం రక్తనమూనా తీస్తే నిర్ధారణ జరుగుతుందని తెలిపారు. ఈ సర్వే గ్రామంలో కొంతమందికి మాత్రమే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ప్రకారం పరీక్షలు నిర్వహించి నిర్ధారణ తరువాత చర్యలు చేపట్టనున్నట్లు అధికారిణి మణి తెలిపారు. కార్యక్రమంలో బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి. సబ్‌యూనిట్ అధికారి ఈశ్వరరావు, విజయనగరం జిల్లా మలేరియా అధికారులు, సిబ్బంది, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

మృతిచెందిన పోలీసు కుటుంబానికి చేయూత


వెంకటేశ్వర్లు కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో పనిచేసి, ఇటీవల మృతిచెందిన ఎస్సై కుటుంబానికి చేయూతనందించేందుకు పోలీసు సిబ్బంది పోగుచేసిన మొత్తాన్ని ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. కొత్తవలస పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పనిచేసిన కె.వెంకటేశ్వర్లు అనారోగ్య కారణాలతో ఇటీవల మృతిచెందారు. దీంతో ఆయన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు పోలీసు సిబ్బంది పోగుచేసిన రూ.లక్షా 48వేల చెక్కును మృతుడి సతీమణి బంగారమ్మకు ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ న మాట్లాడుతూ పోలీసుశాఖలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు, ఆకస్మికంగా, అనారోగ్యంతో మృతిచెందిన పోలీసు కుటుంబాలు అర్ధాంతరంగా కుటుంబ యజమానిని కోల్పోయి, ఆర్థికంగా నష్టపోయిన సమయంలో ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ అందేంత వరకూ పోలీసుశాఖ ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, కొంతమొత్తాన్ని పోగుచేసి, బాధిత కుటుంబాలకు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ పి.శ్రీనివాసరావు, ఆఫీస్ సూపరింటెండెంట్ ఏఎస్‌వీ ప్రభాకరరావు, పోలీసు కుటుంబసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోండి

• డీఎస్‌డీఓ ఎస్.వెంకటేశ్వరరావు

విజయనగరం: ఇప్పటివరకు జరిగిన జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు తమ వివరాలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో ఈనెల 6వ తేదీలోగా నమోదు చేసుకోవాలని విజయనగరం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో తీసుకురాబోతున్న నూతన క్రీడా పాలసీ ప్రకారం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు వివరాలు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన, పాల్గొన్న క్రీడాకారులు, ఖేలో ఇండియా స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా వారికి అందజేయాలని సూచించారు. ఇతర వివరాల కోసం ఫోన్ 9491767327, 918341052254 (విజయనగరం) 9701648344(మన్యం) నంబర్లను సంప్రదించాలని సూచించారు.

టెట్‌లో రాణించిన పేదింటి బిడ్డలు

• టెట్ ఫలితాల్లో సత్తా చాటిన పేద నిరుద్యోగినులు

విజయనగరం అర్బన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏ రంగంలోనైనా పోటీని ఎదుర్కొని ప్రతిభను చూపడం అందరికీ సాధ్యమైన పని కాదు. ముఖ్యంగా ఉద్యోగ సాధన పేదలకు మరింత కష్టతరం. పట్టుదల, ఏకాగ్రత ఉంటే ఎవరైనా, ఏదైనా సాధించవచ్చని విజయనగరం పట్టణానికి చెందిన ఇద్దరు పేద నిరుద్యోగినులు నిరూపించారు. రోజు కూలీ బతుకుల నేపథ్యం గల వారి తల్లిదండ్రులు పిల్లలకు తెలివితేటలు ఉన్నప్పటికీ పై చదువులు చదివించలేని ఆర్థిక పరిస్థితి వారిది. ఇంటర్మీడియట్‌తోనే చదువు ఆపేసి బోధన వృత్తిపై ఆసక్తి పెంచుకున్న ఇద్దరు పేద నిరుద్యోగినులు ఉపాధ్యాయ పోస్టుల సాధనకు సాన పట్టారు. డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టుల భర్తీ కోసం తొలుత జరిగే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్)లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో సత్తా చాటి తొలి రెండు స్థానాలు సాధించారు.


తల్లిదండ్రులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ అశ్విని

పవిత్ర గురు వృత్తి లక్ష్యంగా..

ఏపీ టెట్ పోటీ పరీక్షలో 150/150 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచాను. పట్టణంలోని కస్పా మున్సిపల్ స్కూల్లో పదో తరగతి, అదే కస్పా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాను. ఇంకా పైచదువులు చదివి బోధన వృత్తిలో స్థిరపడాలనుకున్నాను. మా తండ్రి శంకరరావు ఆటో డ్రైవింగ్‌తోనే మా కుటుంబ పోషణ. పై చదువులు చదివే స్థోమత లేకపోవడంతో ఇంటర్మీడియట్‌తో పైచదువులు ఆపేసి టీచర్స్ ట్రైనింగ్ కోర్స్ చేశాను. డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగం తెచ్చుకోవాలని లక్ష్యంగా చేసుకున్నాను. తల్లిదండ్రుల సహకారంతో ఆ లక్ష్యాన్ని సాధించుకుంటున్నాను. త్వరలో జరిగే డీఎస్సీ పరీక్షల్లో కూడా ప్రతిభ చూపి మంచి మార్కులు తెచ్చుకోవాలని కృషి చేస్తున్నాను.

– టెట్‌లో స్టేట్‌ఫస్ట్ ర్యాంకర్ కోండ్రు అశ్విని


తల్లిదండ్రులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ ధనలక్ష్మి

టీచర్ పోస్టు సాధిస్తాను

ఏపీ టెట్‌లో ఎస్జీటీ కేటగిరి పోస్టు పరీక్షలో 149.99/150 మార్కులు తెచ్చుకుని రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించాను. చిన్నప్పటి నుంచి టీచర్ ఉద్యోగం అంటే నాకు ఇష్టం. టీచర్ అవ్వాలంటే ఇంటర్మీడియట్, టీచర్ ట్రైనింగ్ శిక్షణ కోర్సు చదివితే సరిపోతుందని తెలుసుకుని ఆ చదువులు పూర్తి చేశాను. జూన్‌లో జరిగిన టెట్‌లో కూడా మంచి మార్కులు వచ్చాయి. పట్టణంలోని వీటీ అగ్రహారం మా నివాసం. నాన్న వెల్డింగ్ షాప్‌లో చిరుద్యోగిగా పనిచేస్తున్నారు. అమ్మ ఈశ్వరమ్మ గృహిణి. త్వరలో జరిగే డీఎస్సీ పోటీ పరీక్షల్లో మంచి మార్కులతో టీచర్ పోస్ట్ సాధిస్తాను.

–దాసరి ధనలక్ష్మి, టెట్ రాష్ట్రస్థాయి సెకెండ్ ర్యాంక్

టెట్ టాపర్స్‌కు కలెక్టర్ అభినందన

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో అత్యున్నత ప్రతిభ చూపి, రాష్ట్రస్థాయిలో మొదటి, రెండవ ర్యాంకులను సాధించిన విద్యార్థినులను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అభినందించారు. టెట్‌లో జిల్లాకు చెందిన కోండ్రు అశ్విని 150కి 150 , దాసరి ధనలక్ష్మి 149.99 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. అలాగే 149.56 మార్కులను సాధించిన చీపురుపల్లికి చెందిన దేవ హారిక మరికొందరితో పాటు తృతీయ స్థానంలో నిలిచింది. ఈ ముగ్గురు విద్యార్థినులను కలెక్టర్ అంబేడ్కర్ తన ఛాంబర్‌లో మంగళవారం అభినందించారు. ఇదే పట్టుదలతో చదివి ఉపాధ్యాయులుగా ఎంపిక కావాలని, మరింత ఉన్నత స్థానాలను సాధించాలని ఆకాంక్షించారు. ర్యాంకర్లతో పాటు జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యం నాయుడు పాల్గొన్నారు.


టెట్ ర్యాంకర్లను అభినందిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్. అంబేద్కర్

కాంట్రాక్ట్ పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించాలి

• మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేత


మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు

సాలూరు: ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల కాంట్రాక్ట్ ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించాలని స్త్రీశిశు సంక్షేమం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని ఆశ్రమ పాఠశాల కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు సాలూరు పట్టణంలో ఆమె స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత 10 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా తాము పనిచేస్తున్నామన్నారు. తమ పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించి, తమను రెగ్యులర్ చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1284 మంది ఉపాధ్యాయులం ఉన్నామని తెలియజేశారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చంద్రశేఖర్, బాలరాజు, గణపతిరావు, త్రినాథ, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ నెల 3వ వారంలో ధాన్యం కొనుగోలు


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

• జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్

విజయనగరం అర్బన్: ఈ నెలలో మూడో వారం నుంచి జిల్లాలో ధాన్యం సేకరణ ప్రారంభం కానుందని, దీనికోసం ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఆదేశించారు. అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా ఈ ప్రక్రియను నిర్వహిస్తామని చెప్పారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 3,20,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించే అధికారులు, సిబ్బందికి కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో జేసీ మంగళవారం పాల్గొని మాట్లాడారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధరను కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. పరిస్థితులు, పంట దిగుబడిని బట్టి జిల్లాను 258 క్లస్టర్లుగా విభజించామని, ఒక్కో క్లస్టర్‌లో రెండు లేదా మూడు రైతు సేవా కేంద్రాలు ఉంటాయని తెలిపారు. జిల్లాలోని 501 రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లు, రైతుమిత్ర సంఘాల ద్వారా ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది సుమారు 26 లక్షల గోనె సంచులు అవసరమని, ఒక్కో మిల్లుకు దాని సామర్థ్యాన్ని బట్టి 30వేల గోనె సంచులను సిద్ధం చేయాలని ఆదేశించామన్నారు. ధాన్యం తరలించేందుకు సుమారు 3,000 వాహనాలను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. జీపీఎస్ సదుపాయం కలిగిఉండి, సివిల్ సప్లయిస్ వద్ద నమోదు చేసుకున్న వాహనాల ద్వారా మాత్రమే ధాన్యం తరలింపు జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని మాత్రమే రైతుల నుంచి కొనుగోలు చేయనున్నట్లు జేసీ స్పష్టం చేశారు. ఈ-పంట నమోదు చేసుకుని ఈ-కేవైసీ పూర్తయిన రైతులు, తమ ధాన్యం విక్రయించేందుకు సిద్ధమైన రైతుల నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మీనాకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు, జిల్లా సహకార అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను త్వరలో పట్టుకుంటాం

• డీఎస్పీ రాఘవులు


వివరాలు ఆరా తీస్తున్న డీఎస్పీ రాఘవులు

రాజాం సిటీ: పట్టణంలో ఈ నెల 2వ తేదీ రాత్రి జరిగిన దొంగతనం కేసులో నిందితులను త్వరలో పట్టుకుంటామని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. మున్సిపాల్టీ పరిధి పాలకొండ రోడ్డులో 27 తులాల బంగారం చోరీ జరిగిన సలాది శేషగిరిరావు ఇంటిని డీఎస్పీ మంగళవారం సందర్శించారు. చోరీ జరిగిన తీరును పరిశీలించి బాధితుల వద్ద వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుని బాధితులకు న్యాయం చేస్తామని వెల్లడించారు. డీఎస్పీతో పాటు రాజాం రూరల్ సీఐ హెచ్‌ఉపేంద్ర ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: స్థానిక ఎమ్మార్వో కార్యాలయం సమీపంలోని బాసినివీధిలో అనుమానాస్పద రీతిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. బాసిన వీధిలో ఉంటున్న కూన రాజేష్ (36) సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లోనే పురుగు మందు కలిపి మద్యం తాగి మృతిచెందినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆరేళ్లుగా రాజేష్ కుటుంబానికి దూరంగా ఉంటూ పోషణ నిమిత్తం ఆప్టింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ తగాదాలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. సింగిల్‌గా ఇక్కడ ఉంటున్నాడు. మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడా? ఏవైనా ఇతరత్రా కారణాలున్నాయా? అనే కోణంలో విచారణ చేపట్టామని, అనుమానాస్పద మృతి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

కరెంట్ దొంగలపై కొరడా..!

• ఆకస్మిక తనిఖీలతో కేసులు నమోదు చేస్తున్న విద్యుత్‌శాఖ
• కేసుల నమోదు, జరిమానా విధింపు

విజయనగరం ఫోర్ట్: అక్రమంగా విద్యుత్ వినియోగించేవారిపై విద్యుత్ శాఖ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఈ మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు. విద్యుత్ శాఖకు చెందిన విజిలెన్స్ విభాగంతో పాటు ఆ శాఖ అధికారులు తరచూ తనిఖీలు చేపడుతున్నారు. జిల్లాలో లైటింగ్స్, ప్రైవేట్ ఫంక్షన్స్‌కు కొంతమంది విద్యుత్ లైన్ నుంచి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నారు. మరి కొంతమంది గృహ విద్యుత్ మీటర్‌తో చిన్నపాటి పిండి మిల్లులు, దుకాణాలు వంటివి నిర్వహిస్తున్నారు. ఇటువంటి అక్రమ వినియోగం వల్ల విద్యుత్‌శాఖకు భారీ స్థాయిలో నష్టం వాటిల్లుతోంది.

2024–25లో 567 కేసుల నమోదు

విద్యుత్‌శాఖకు చెందిన విద్యుత్ చౌర్య తనిఖీ విభాగం (విజిలెన్స్), ఆపరేషన్ ఇంజినీర్స్ వేర్వేరుగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 2024–25 అక్టోబర్ నెలాఖరు వరకు 567 కేసులు నమోదు చేసి రూ.36.68 లక్షలు అపరాధ రుసుము విధించారు. అదేవిధంగా 2023–24లో 519 కేసులు నమోదు చేసి రూ.17. 70 లక్షలు అపరాధ రుసుం విధించారు.

అత్యాశకు పోయి అడ్డంగా..

ప్రభుత్వం సరఫరా చేసే విద్యుత్ ఎంత వినియోగించినా డబ్బులు కట్టనవసరం లేదు. అదే ఇంట్లో ఉన్న విద్యుత్ వినియోగిస్తే బిల్లు కట్టాలి. బిల్లు కట్టాల్సిన అవసరం లేదనే భావనతో అక్రమంగా విద్యుత్ వినియోగించి అడ్డంగా దొరికిపోతున్నారు. కొంతమంది అత్యాశకు పోయి విద్యుత్ లైన్ ద్వారా అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ఆ సమయంలో విద్యుత్‌శాఖ అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు పట్టుబడుతున్నారు.


అక్రమ విద్యుత్ వాడకం పోస్టర్

జిల్లాలో విద్యుత్ కనెక్షన్ల వివరాలు

కేటగిరి	విద్యుత్ కనెక్షన్ల సంఖ్య
కేటగిరి-1	6,04,535
కేటగిరి-2	65,194
కేటగిరి-3	2,822
కేటగిరి-4	14,168
కేటగిరి-5	38,000

అదనపు లోడ్‌కు అనుమతి అవసరం

అదనపు లోడ్ వాడాలనుకుంటే విద్యుత్‌శాఖ అనుమతి తీసుకోవాలి. కేటగిరి-1కు తీసుకుని షాపులకు వినియోగించడం నేరం. విద్యుత్ అక్రమంగా వినియోగించినట్లయితే విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ ఇంజినీర్స్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తారు.

– మువ్వల లక్ష్మణరావు, ఎస్‌ఈ, ఏపీఈపీడీసీఎల్

నేటి నుంచి ఆంధ్ర-ఉత్తరాఖండ్ రంజీ మ్యాచ్


చింతలవలస డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ప్రాక్టీస్ చేస్తున్న ఆంధ్రా జట్టు సభ్యులు

విజయనగరం: రంజీ క్రికెట్ సందడికి విజయనగరం వేదిక కానుంది. ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరగనున్న క్రికెట్ మ్యాచ్ డెంకాడ మండలంలోని చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఆతిథ్య ఆంధ్రప్రదేశ్–ఉత్తరాఖండ్ జట్ల మధ్య బుధవారం ప్రారంభం కానుంది. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు టెస్ట్ మ్యాచ్ తరహాలో జరిగే మ్యాచ్‌లో పోటీ పడనున్న ఆంధ్ర జట్టు సభ్యుల వివరాలను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్‌బాబు మంగళవారం ప్రకటించారు. ఆంధ్ర జట్టుకు ఎస్.కె.రషీద్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారని తెలియజేశారు. ఇదిలా ఉండగా ఇప్పటికే ఇరు జట్ల క్రీడాకారులు చింతలవలస చేరుకుని ప్రాక్టీస్ చేస్తున్నారు. మ్యాచ్‌ను ఉచితంగా చూసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు నార్త్‌జోన్ క్రికెట్ అసోసియేషన్ ఛైర్మన్ ఎం.వాసుదేవరాజు తెలిపారు.

ఆంధ్ర జట్టు సభ్యులు

ఎస్.కె.రషీద్ (కెప్టెన్), టి.విజయ్, కె.ఎస్.భరత్, జి.హనుమ విహారి, షేక్ ఎం.డి రఫీ, వై.సందీప్, ఎం.వంశీకృష్ణ, ఎం.అభిషేక్ రెడ్డి, కె.వి.శశికాంత్, సి.ఆర్.జ్ఞానేశ్వర్, సి.హెచ్.స్టీఫెన్, పి.వి.సత్యనారాయణరాజు, ఎ.లలిత్ మోహన్, జి.మనీష్, కె.కరణ్ షిండే, ఎం.హేమంత్‌రెడ్డి.

రాష్ట్రస్థాయి స్కిప్పింగ్ పోటీలకు విద్యార్థిని ఎంపిక


స్కిప్పింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి మోడల్ పాఠశాల విద్యార్థిని అనూష రాష్ట్రస్థాయి స్కిప్పింగ్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేష్ మంగళవారం తెలిపారు. అండర్–19 విభాగంలో కొద్ది రోజుల క్రితం విజయనగరంలోని పువ్వాడ స్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ఆమె ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికవడంతో ఈనెల 7, 8 తేదీల్లో గుంటూరులో జరిగే పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన అనూషను ఎంఈఓలు వెంకటరావు, సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

అంతర్‌వర్సిటీ పోటీలకు ముగ్గురు విద్యార్థినులు


ఎంపికైన విద్యార్థినులతో నిర్వాహకులు

రాజాం సిటీ: అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు హాజరయ్యేందుకు రాజాం పట్టణంలోని జీసీఎస్‌ఆర్ కళాశాల వేదికగా నిర్వహించిన ఎంపిక పోటీల్లో ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారని అంబేడ్కర్ యూనివర్సిటీ పీడీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం జీఎంఆర్ ఐటీ స్పోర్ట్స్ ఎరినాలో నిర్వహించిన ఎంపికలకు యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలల నుంచి 25 మంది విద్యార్థులు హాజరై పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. వారిలో శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలకు చెందిన డి.హేమశ్రీ 55 కేజీల విభాగం), జి.వర్షిత (64 కేజీల విభాగం) ఎస్.ఝాన్సీరాణి (76 కేజీల విభాగం)లో ఎంపికయ్యారని ఆయన తెలిపారు. పురుషులు ఎవరూ ఆశించిన స్థాయిలో బరువు ఎత్తకపోవడంతో ఎంపిక చేయలేదని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినులు ఈ నెల 25 నుంచి 28 వరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తం, సీహెచ్ రవీంద్రకుమార్, భాస్కరరావు, జీఎంఆర్ ఐటీ పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్, జీసీఎస్‌ఆర్ పీడీ చీకటి కేశవనారాయణరావు, మహేష్ తదితరులు అభినందించారు.

అంతర్ వర్సిటీ పోటీలకు సత్య కళాశాల జట్ల ఎంపిక


విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణ్ రావు

విజయనగరం అర్బన్: ఈ నెల మూడో వారంలో జరగబోయే సౌత్‌వెస్ట్ జోన్ అంతర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనేందుకు విజయనగరానికి చెందిన సత్య డిగ్రీ, పీజీ కళాశాల వెయిట్ లిఫ్టర్ల జట్లు ఎంపిక అయ్యాయి. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయి దేవమణి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల విశాఖలోని బుల్లయ్య కాలేజీలో జరిగిన ఆంధ్రయూనిర్సిటీ అంతర కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ ఉమెన్ పోటీలలో సత్య డిగ్రీ, పీజీ కళాశాలకు టీం చాంపియన్‌షిప్‌లో రన్నర్స్‌గా నిలిచి అర్హత పొందారని తెలిపారు. ఈ పోటీలలో విద్యార్థులు సాధించిన పతకాల వివరాలను ప్రకటించారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల సంచాలకుడు డాక్టర్ ఎం.శశి భూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు వారు ఎంచుకున్న రంగంలో మిక్కిలి నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం విజేతలకు నగదు బహుమతి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం. ఉదయ్ కిరణ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరపు నాయుడు, ఫిజికల్ డైరెక్టర్లు మహేష్, ప్రసాద్, కోచ్ చల్లా రాము పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట: ప్రాథమిక రంగాల ద్వారా ఇచ్చే ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్థక, మత్స్యశాఖలకు సంబంధించిన పథకాలు గిరిజనులకు ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. డిసెంబర్ నాటికి నిధులు ఖర్చు చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమయ్యే వారికి మాత్రమే పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. లబ్ధిదారుల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. మత్స్యశాఖ పథకాలన్నీ ఆ శాఖ సొసైటీకి అందేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక శాఖాధికారి ఎస్.మన్మథరావు, మత్స్యశాఖ జిల్లా అధికారి తిరుపతయ్య, ఏపీడీ సన్యాసిరావు, ఎఫ్‌డీవో గోపాలకృష్ణ, పశుసంవర్థకశాఖ ఎ.డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కంచమ్మతల్లీ.. కరుణించమ్మా..

• అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు
• మొక్కుబడుల చెల్లింపు
• భక్తుల సేవలో స్వచ్ఛంద సేవకులు


కంచమ్మతల్లికి పూజలు చేసి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

మెరకముడిదాం: మండలంలోని కొండలావేరు గ్రామ సమీపంలో బోడికొండపై వెలసిన కంచెమ్మతల్లి జాతరకు భక్తులు పోటెత్తారు. ఏటా నాగులచవితి నాడు జాతర నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం నిర్వహించిన జాతరలో మండలవాసులతో పాటు చీపురుపల్లి, గరివిడి, గుర్ల, తెర్లాం, బొబ్బిలి, బాడంగి, దత్తిరాజేరు మండలాలకు చెందిన వారితో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. పసుపుకుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఉదయం 7 గంటల నుంచి పెరిగిన భక్తుల తాకిడి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. క్యూలు కిక్కిరిశాయి. సుమారు 80 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించినట్టు ఆలయ కమిటీ సభ్యులు అంచనా వేస్తున్నారు. భక్తులకు మజ్జిగ, తాగునీరు, ప్రసాదాలను పలువురు స్వచ్ఛంద సేవకులు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బుధరాయవలస ఎస్‌ఐ జి.లోకేష్‌కుమార్ తన సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.


కంచమ్మతల్లి దర్శనానికి బారులుతీరిన భక్తులు